వైద్య విద్యను గాలికి వదిలేశారు



వైద్య విద్యకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. కార్పొరేట్ వైద్యం, వైద్య విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల వస్తోందని ఎంతో సంతోషించాం. కూటమి ప్రభుత్వం దీనికి తూట్లు పొడిచింది. వైఎస్సార్‌సీపీపై అక్కసుతో మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వంలోనే మెడికల్ కళాశాల పనులు 50 శాతం పూర్తయ్యాయి. దానిని పూర్తి చేయకపోవడం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు.

– బి.గోవిందరావు, చామంతిపురం, మాకవరపాలెం మండలం

అన్ని వర్గాలను నిరాశపర్చిన బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా అభివృద్ధికి దోహదపడేలా లేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.17 వేల కోట్లు అవసరం. అయితే కేవలం రూ.605 కోట్లు కేటాయించారు. తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల అభివృద్ధికి, ఆయకట్టుల స్థిరీకరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఏ మూలకు సరిపోవు. నీటిపారుదల ప్రాజెక్టులకు వనరుల కేటాయింపులో నిర్లక్ష్యం ప్రదర్శించారు. సాగునీటి వనరులు, వ్యవసాయాభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విషయాన్ని ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుంది. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అంశాల పట్ల ప్రభుత్వం తగిన భరోసా ఇవ్వలేదు. సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై హామీ ఇవ్వలేదు. యువతకు నిరుద్యోగ భృతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయం. ఇప్పటికే మెగా డీఎస్సీ రాకపోవడం, గ్రూప్–2 పరీక్ష విషయంలో నిరాశ చెందిన యువతను ఈ బడ్జెట్ హతాశులను చేసింది. ప్రజల ఆశలను అపహాస్యం చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది.

–కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌లో కనిపించని వైజాగ్ జాడ

విశాఖను ఆర్థిక రాజధానిగా మారుస్తాం!

ఐటీకి విశాఖనే కేంద్రం!!

విశాఖలో విజయవాడతో పాటు మెట్రో పనులు ప్రారంభిస్తాం!!!

విశాఖ పర్యటనలో అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేష్‌లు ఊదరగొడుతూ పదే పదే చేసే మాటలు **ఇవి. తీరా బడ్జెట్ కేటా**యింపులు వచ్చే సరికి మాత్రం విశాఖ పేరునే ఉచ్చరించేందుకు తమకిష్టంలేదన్న రీతిలో **వ్యవహరించారు. ఇటు** విశాఖ మెట్రోకు కానీ, అటు విశాఖ పర్యాటక రంగానికి కానీ పూర్తిస్థాయిలో కేటాయింపులు లేవు. **మరోవైపు ఏజెన్సీపైనా కూటమి ప్రభుత్వం చిన్నచూపు స్పష్టంగా కనిపించింది.**

జీవీఎంసీకి పైసా విదల్చని ప్రభుత్వం

- **వైజాగ్ మెట్రో ప్రాజెక్టు ఊసేదీ?**
- **ఏయేటికీ పాత కేటాయింపులే..**
- **మెడికల్ కాలేజీలకు కేటాయింపులు నిల్**
- పర్యాటక రంగానికి పడకేసిన నిధులు


సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో గత ప్రభుత్వ హయాంలో కొత్త బీచ్‌ల అభివృద్ధి, కొత్త రోడ్ల అభివృద్ధితో పాటు కొంగొత్త విశాఖను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. తాజాగా బడ్జెట్ పద్దులో విశాఖ పేరును ఐదుసార్లు ప్రస్తావించారు. స్మార్ట్ సిటీ కింద ఒక్క పైసా కేటాయించలేదని 3 సార్లు ప్రస్తావించగా.. ఇన్వెస్ట్‌మెంట్ టు ఇన్నోవేటివ్ ఇంటిగ్రేట్ అండ్ సస్టేన్ సిటీస్ కింద గత ఏడాదిలో రూ.20 కోట్ల మేర కేటాయిస్తున్నట్టు రెండు సార్లు ప్రస్తావించారు. అది కూడా గత ఏడాదిలో రూ. 26 కోట్లు కేటాయించగా... ఈ సారి తగ్గిస్తున్నట్టు చెప్పారు. వాస్తవానికి నగరంలో ఫ్లై ఓవర్లను నిర్మిస్తామని, భోగాపురం విమానాశ్రయానికి రహదారి నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా ఐటీకి విశాఖ నగరాన్ని కేంద్ర బిందువుగా మారుస్తామని కూడా హామీ ఇచ్చారు. అయితే ఆ మేరకు ఎక్కడా బడ్జెట్ కేటాయింపులు జరపలేదు.

మెట్రోరైలు ప్రాజెక్టు పట్టాలెక్కేదెట్లా...?



విశాఖ, విజయవాడలల్లో మెట్రో రైలు ప్రాజెక్టును చేపడతామని కూటమి నేతలు పదే పదే చెబుతూ వచ్చారు. అంతేకాకుండా విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నట్టు హడావుడిగా ప్రకటించారు. మొదటి విడతలో మొత్తం 46.23 కిలోమీటర్ల మేర రూ.11,498 కోట్లతో మూడు కారిడార్లుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. రెండో విడతలో రూ. 5,734 కోట్ల నిధులతో 30.67 కిలోమీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టును చేపడతామని ప్రకటించారు. తీరా చూస్తే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.50 కోట్ల మేర ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులు కూడా అటు విజయవాడ, ఇటు వైజాగ్‌కు కలిపి కావడం గమనార్హం.



సాగునీటి ప్రాజెక్టులకు అంతంత మాత్రమే..!



ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు కూడా కనీస నిధులను కేటాయించలేదు. పెద్దేరు ప్రాజెక్టుకు రూ.2 కోట్లు,రైవాడకు రూ.75 లక్షలు, కోనాం ప్రాజెక్టుకు రూ.10 లక్షలు మాత్రమే కేటాయింపులు చేసింది. మరోవైపు ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి మాత్రం రూ. 605 కోట్ల మేర నిధులను కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఈ ఏడాదిలో కేటాయింపుల్లో ఏ మేరకు ఖర్చు చేయనుందనేది అనుమానమే. వాస్తవానికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.670 కోట్లు కేటాయిస్తామని గత జూలైలో ఎస్.రాయవరం వచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు హామీనిచ్చారు. కేటాయింపుల్లో మాత్రం కోత విధించారు.

విద్య, వైద్యంపై శ్రద్ధేదీ.. ?



ఉత్తరాంధ్రలో ఉన్నత విద్యారంగానికి కేంద్రం ఆంధ్ర యూనివర్సిటీ. అటువంటి కీలకమైన యూనివర్సిటీకి నిధుల కేటాయింపులో ఒక్కపైసా అదనపు కేటాయింపులు కనిపించలేదు. గత ఏడాది బడ్జెట్ తరహాలోనే ఈ ఏడాది కూడా రూ. 389.34 కోట్లను మాత్రమే కేటాయించారు. విశాఖలోని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు కేవలం రూ.27.91 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 59.48 కోట్ల మేర కేటాయించగా...ప్రస్తుత బడ్జెట్‌లో **సగానికిపైగా కేటాయింపులు తగ్గించారు. మరో**వైపు పాడేరు, నర్సీపట్నం మెడికల్ కాలేజీల అభివృద్ధి **ప్రస్తావన కూడా చేయకపోవడం గమనార్హం. పా**డేరు మెడికల్ కాలేజీతో పాటు అనకాపల్లి జిల్లాలో నర్సీప**ట్నంలో కూడా మెడికల్ కాలేజీల గురించి కూట**మి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు.

టూరిజానికి నిధులేవీ...!



రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి బాగా అవకాశం ఉన్న ప్రాంతం **ఉమ్మడి విశాఖ జిల్లానే.** అటు ఏజెన్సీతో పాటు ఇటు నగరంలోని సముద్ర **తీరంలో అభివృద్ధి పను**లు చేపడితే దేశీయ పర్యాటకులతో పాటు విదేశీ పర్యా**టకులను కూడా మరింత** ఆకర్షించేందుకు అవకాశం ఉంటుంది. బడ్జెట్‌లో పర్యా**టక రంగానికి ఉమ్మడి విశాఖ** జిల్లాలో ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కొత్త **బీచ్‌ల అభివృద్ధికి, ఏజెన్సీలో ప**ర్యాటక రంగ అభివృద్ధికి బడ్జెట్‌లో ఏ మాత్రం శ్రద్ధ **చూపించలేదు. గత ప్రభుత్వ హ**యాంలో విశాఖ పరిధిలో కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయ**డంతో పాటు టీడీసీకి చెందిన హో**టల్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ **జిల్లా పర్యాటకరంగ అభివృద్ధికి** ఒక్క పైసా కూడా విదల్చకపోవడంపై విమర్శలు వ్యక్తమ**వుతున్నాయి.**

కేటాయింపులు సరే... ఖర్చేదీ?



విశాఖ అభివృద్ధి విషయంలో.. ముందు బడ్జెట్‌లో చేసిన **అంచనాల**కు, తర్వాతి బడ్జెట్‌లో సవరించిన అంచనాలకు కూటమి **ప్రభుత్వం** చాలా వ్యత్యాసం చూపుతోంది. విశాఖపట్నం–చెన్నై పారి**శ్రామిక కారిడార్ అభివృద్ధికి** గత బడ్జెట్‌లో రూ. 841 కోట్ల మేర కేటాయించి.. కేవలం రూ. 259 కోట్లను మాత్రమే ఖర్చు చేయనున్నట్టు సవరించిన అంచనాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే, మార్చి చివరి నాటికి కచ్చితమైన లెక్కలు తీస్తే... అంతిమంగా ఈ వ్యయం కాస్తా రూ. 100 కోట్లను కూడా దాటే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఈ ఏడాది కూడా బడ్జెట్‌లో ఘనంగా రూ. 847 కోట్ల మేర కేటాయింపులు జరిపింది. అయితే, వాస్తవంగా ఎంత మేర ఖర్చు చేస్తుందనేది అనుమానమే. విశాఖపట్నం నగర అభివృద్ధిలో ఎంతో కీలకంగా మారనున్న భోగాపురం విమానాశ్రయానికి కూడా గత ఏడాది బడ్జెట్‌లో రూ. 147.42 కోట్లు కేటాయించినప్పటికీ వ్యయంలో మాత్రం రూ. 16.15 కోట్లు మాత్రమే సాధ్యపడింది. ఇక ప్రస్తుత బడ్జెట్‌లో రూ.195 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ఇందులో వాస్తవిక వ్యయం ఎంత మేర ఉంటుందనేది వచ్చే ఏడాది బడ్జెట్‌లో బయటపడనుంది.

గిరిజనులకు మొండిచేయి...!

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎంతో కీలకం. ఇక్కడ ఉన్న గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి... ప్రాసెస్ చేసి అందిస్తున్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కి ప్రభుత్వం పూర్తిగా మొండిచేయే చూపింది. బడ్జెట్‌లో జీసీసీకి కేవలం రూ. 20 లక్షలు మాత్రమే కేటాయించారు. ఇక గిరిజనుల్లోనే అత్యంత వెనుకబడిన పీవీటీజీలు... చెంచులు, గదబ, సవర, పోర్జ వంటి కులాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు గానూ మూలధన ఆస్తుల (కేపిటల్ అసెట్స్) కల్పనకు ఒక్క పైసా కూడా విదల్చలేదు. గతంలో ఇందుకోసం రూ. 16.75 కోట్ల మేర వెచ్చించారు.

దగాకోరు బడ్జెట్

- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దగాకోరు బడ్జెట్‌తో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఒనగూరేదేమీ లేదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. శుక్రవారం దేవరాపల్లి మండలం తారువలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించకుండా చంద్రబాబు మరో మారు రాష్ట్ర ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు నిధులు కేటాయించకుండా వంచనకు గురి చేశారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర నిధులు కేటాయింపులతో రైతులను, మహిళలను మోసం చేయడం దారుణమన్నారు. పింఛన్లు, ఉచిత గ్యాస్ పథకాలకు లబ్ధిదారుల కోత విధించేదిగా బడ్జెట్ ఉందన్నారు. పూర్తిగా ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మోసపూరిత బడ్జెట్ అని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళలకు మోసం



మహిళా శక్తి పథకం కింద 19 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఇంతవరకు అమలు చేయలేదు. ఈ బడ్జెట్‌లో కూడా డబ్బులు కేటాయించలేదు. గెలవడం కోసమే అలవి కాని హామీలు ఇచ్చారు. జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాడు. చంద్రబాబువి అన్ని సూపర్ మోసలే.

–నారాపురెడ్డి కుమారి, జగన్నాధపురం, నక్కపల్లి మండలం

ఉచిత బస్సు ఊసే లేదు...



బడ్జెట్‌లో మహిళలకు ఉచిత బస్సు ఊసేలేదు. చంద్రబాబు ప్రభుత్వం మరోసారి మహిళలను దగా చేసింది. ఉగాది నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించకపోవటం దురదృష్టకరం. తల్లికి వందనం పథకానికి అరకొర నిధులు కేటాయించారు. మహిళాశక్తి పథకానికి ఒక్క రూపాయ కూడా ఇవ్వలేదు.

– షేక్ ఉన్నీసా బేగం, నర్సీపట్నం

వ్యవసాయ రంగానికి మేలు చేయని బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం దక్కలేదు. పంటలకు గిట్టుబాటు ధర గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఇటీవల ధర పడిపోయిన టమాటా వంటి పంటలను సాగు చేసే రైతుల్ని ఆదుకునేందుకు ప్రోత్సాహక నిధులు మంజూరు చేయలేదు. సహకార చక్కెర కర్మాగారాలను ఆదుకునే చర్యలు లేవు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కేటాయించిన నిధులు సరిపోవు.

–కర్రి అప్పారావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, తిమ్మరాజుపేట

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 34 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 26,161 మంది విద్యార్థులు

యలమంచిలి రూరల్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. మార్చి 1న మొదటి సంవత్సరం విద్యార్థులకు, 3న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చేరిన మూడు సెట్ల ప్రశ్న పత్రాలను ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 26,161 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. 8 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారిణి బి.సుజాత తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే 9491334395, 08924220225లో సంప్రదించాలని సూచించారు.

తప్పు జరిగింది

- ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం
- పూర్వ తహసీల్దార్ పాత్ర ఉన్నట్టు నిర్ధారణ!
- కలెక్టర్‌కు నివేదిక పంపిన విచారణాధికారి

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం రేగుపాలెం గ్రామ సర్వే నెంబర్లు 167/1, 167/3లో 2.91 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన వ్యవహారంలో సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం పంపినట్టు తహసీల్దార్ కె.వరహాలు తెలిపారు. యలమంచిలిలో గతంలో పనిచేసిన ఓ తహసీల్దార్ ప్రభుత్వ అనాధీనం భూమిని ఒక స్థిరాస్తి వ్యాపారి పేరున నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారు. అంతేగాక ప్రైవేటు వ్యక్తి పేరున క్రయ దస్తావేజుకు రిజిస్ట్రేషన్ జరిగేలా అప్పటి అధికారులు, సిబ్బంది సహకరించారు. దీనిపై ఈ నెల 22న 'ప్రభుత్వ భూమిని రాసిచ్చారు' శీర్షికన సాక్షిలో సమగ్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ విజయ కృష్ణన్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సింగా యలమంచిలి తహసీల్దార్‌ను ఆదేశించారు. రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తహసీల్దారు నివేదికను రూపొందించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇక్కడ రెండుసార్లు పనిచేసిన పూర్వ తహసీల్దార్, ఆ సమయంలో పనిచేసిన కిందిస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని అధికారులు నిర్ధారణకు వచ్చారు. తొలుత ఆ భూమికి సంబంధించి జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాన్ని రద్దు చేయడం, రెవెన్యూ రికవరీ చట్టం(ఆర్వోఆర్) చట్టం ప్రకారం డీఆర్వో కోర్టులో దీనికి సంబంధించి కేసు దాఖలు చేయడంతో పాటు ఈ భూమికి యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన క్రయ దస్తావేజును రద్దు చేయడానికి తగు చర్యలకు సిఫార్సు చేస్తూ 5 పేజీల సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ఈ వ్యవహారంపై మరొక ఉన్నతస్థాయి విచారణ తర్వాత సీసీఏ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి అడ్డదారులు తొక్కినే అధికారులు, ఉద్యోగులపై శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.

వేసవి తాగునీరుకు ముందస్తు ప్రణాళిక

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: వేసవిలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. మొదటి రోజే శతశాతం పూర్తి చేసేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. అతిసార, డెంగ్యూ, మలేరియా, కలరా వంటి వ్యాధుల ప్రబలకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో మంచినీరు, ఆహార నాణ్యతపై తనిఖీలు చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే ఈ నెల 15లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ కె.వి.నాయుడు, పరిశ్రమల శాఖ మేనేజర్ జి.నాగరాజారావు, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్ ఎ.ఎస్.ఎ.రామస్వామి, పంచాయతీ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి పాల్గొన్నారు.

వినూత్నంగా సైన్స్ డే



శాస్త్రవేత్తల చిత్రపటాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం వినూత్న ప్రదర్శనలు చేశారు. సుమారు 35 మంది శాస్త్రవేత్తల చిత్రపటాలు సేకరించి ప్రదర్శించారు. చెట్టుకు రాఖీ కట్టి ప్రకృతి ప్రేమికులుగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. స్ఫూర్తివంతమైన శాస్త్రవేత్తల కృషి, సైన్స్ వల్ల ప్రయోజనాలను ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌పట్నాయక్, ఉపాధ్యాయులు కె.సంపత్, యర్రా చక్రవర్తి పాల్గొన్నారు.



చెట్టుకు రక్షాబంధన్

స్కూల్ బస్‌ను ఢీకొట్టిన పెట్రోల్ ట్యాంకర్

- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

నర్సీపట్నం : సుబ్బారాయుడుపాలెం మూడు రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో విద్యార్థులు సురక్షితంగా బయటపడగా, ఓ పాదచారుడు తీవ్రంగా గాయపడ్డాడు. నర్సీపట్నం నుంచి భాష్యం స్కూల్ బస్సు విద్యార్థులతో మాకవరపాలెం వైపు వెళ్తుంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ లారీ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో స్కూల్ బస్సుతోపాటు మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. వెంటనే స్కూల్ బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును మలుపు తిప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులోని 40 మందికి పైగా విద్యార్థులు సురక్షితంగా ఉన్నారు. మినీ వ్యాన్‌లో ఉన్న కళాసీలకు స్వల్ప గాయాలయ్యాయి.



ప్రమాద స్థలిలో స్కూల్ బస్, పెట్రోల్ ట్యాంకర్

అయితే అదే సమయంలో విశాఖ నుంచి వచ్చిన బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న రోలుగుంట మండలం జానకిరాంపురం ప్రాంతానికి చెందిన ఆదపురెడ్డి మాతునాయుడును లారీ ఢీకొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ రమణది హత్యే..

- ఇద్దరు మహిళలు అతని ప్రాణం తీశారు
- వేధింపులు తట్టుకోలేక సన్నిహితురాలే హతమార్చింది
- వివరాలు వెల్లడించిన పోలీసు అధికారులు

దేవరాపల్లి: రైవాడకు చెందిన లారీ డ్రైవర్ వారాది రమణ (36)ను ఇద్దరు మహిళలు ఈ నెల 23న హతమార్చినట్లు పోలీసులు నిర్ధారించారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దీనిని హత్య కేసుగా మార్చినట్లు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు తెలిపారు. ఈ హత్యకు సంబంధించి స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావుతో కలిసి శుక్రవారం సీఐ అందించిన వివరాలు.. లారీ డ్రైవర్ రమణకు అదే గ్రామానికి చెందిన మోసూరు చెల్లయ్యమ్మతో గత కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఫిబ్రవరి 23 మధ్యాహ్నం మద్యం మత్తులో రమణ చెల్లయ్యమ్మతో గొడవ పడ్డాడు. ఆమె మేనల్లుడు దేవరాజు ఇద్దరికీ సర్ది చెప్పి రమణను పంపించేశాడు. ఈ గొడవ గురించి చెల్లయ్యమ్మ ఎస్.కోటలో ఉన్న తన అక్క కూతురు కోసూరి లక్ష్మికి చెప్పి ఆమెను అదే రోజు సాయంత్రానికి రైవాడలోని తన ఇంటికి రప్పించింది. మద్యం మత్తులో ఉన్న రమణ ఆ రోజు రాత్రి మళ్లీ చెల్లయ్యమ్మ ఇంటికి వచ్చి గొడవ పడి ఆమెను కర్రతో కొట్టి వెళ్లిపోయాడు. రమణ వేధింపులతో విసిగిపోయిన చెల్లయ్యమ్మ అతడిని హతమార్చేందుకు లక్ష్మితో కలిసి స్కెచ్ వేసింది. రాత్రి 11–12 గంటల సమయంలో రమణ ఇంటికి ఇద్దరూ వెళ్లారు. మద్యం మత్తులో నిద్రిస్తున్న రమణ తలపై తమ వెంట తెచ్చుకున్న కర్రతో చెల్లయ్యమ్మ బలంగా కొట్టింది. రమణ కేకలు వెయ్యడంతో తలగడను అతడి ముఖంపై నొక్కి పెట్టి ఊపిరాడకుండా చేసింది. లక్ష్మి అతడి చేతులు కదపకుండా గట్టిగా పట్టుకుంది. చనిపోయినట్లు నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి ఇద్దరూ వెళ్లిపోయారు. రెండు రోజుల తర్వాత ఇంటి నుంచి దుర్వాసన రావడంతో విషయం బయటపడింది. నిందితులైన ఇద్దరు మహిళలను పోలీసులు విచారించగా నేరాన్ని అంగీకరించడంతో శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ చెప్పారు.

దేవరాజును అరెస్టు చేయాలని ఆందోళన

వారాది రమణ హత్యకు ప్రధాన సూత్రధారి దేవరాజేనని, అతడిని అరెస్టు చేయాలంటూ మృతుడి కుటుంబీకులు, పలువురు గ్రామస్తులు శుక్రవారం దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇద్దరు మహిళలతో అతనే హత్య చేయించాడని, దేవరాజును ఈ కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారంటూ మృతుడి తల్లి చినమ్మలు, భార్య కృష్ణవేణి ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణల గురించి సీఐ వద్ద ప్రస్తావించగా ఈ హత్య కేసులో అతడికి సంబంధం ఉన్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభ్యం కాలేదన్నారు. కేసు విచారణ జరుగుతుందని, అతడి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభిస్తే అతడిపైన కేసు నమోదు చేస్తామన్నారు.



నిందితులతో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ మల్లేశ్వరరావు

గోవాడ సుగర్స్‌ను నిర్వీర్యం చేస్తే సహించం

- చెరకు రైతులకు అండగా నిలిచిన రైతు సంఘం నాయకులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తే ఆందోళనకు దిగుతామని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ముర్రాపు సూర్యనారాయణ హెచ్చరించారు. ఇటీవల వివిధ కారణాలతో పలుమార్లు ఫ్యాక్టరీ క్రషింగ్‌కు అంతరాయం కలగడం, రైతులు ఆందోళనకు దిగడం తెలిసిందే. రాష్ట్ర చెరకు రైతు సంఘం ప్రధాన కార్యదర్శితోపాటు రైతు సంఘం నాయకులంతా ఫ్యాక్టరీ యార్డులో రైతులను శుక్రవారం కలిశారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫ్యాక్టరీని నడిపించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, చెరకు రైతులకు గత సీజన్‌కు సంబంధించి టన్నుకు రూ.150 వెంటనే చెల్లించాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఐదు లక్షల టన్నుల కెపాసిటీ కలిగిన ఫ్యాక్టరీని కనీసం రెండు లక్షల టన్నులు కూడా క్రషింగ్ చేయలేని స్థాయికి తీసుకొచ్చారని, ఫ్యాక్టరీని కాపాడటంతో పాటు చెరకు రైతులకు సకాలంలో పేమెంట్స్, రాయితీలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



చెరకు రైతులతో మాట్లాడుతున్న ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ తుహీన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉద్యోగరీత్యా, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలు తెలుసుకున్నట్టు చెప్పారు. 15 మంది సిబ్బంది హాజరై తమ సమస్యలు ఎస్పీకి విన్నవించుకున్నారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు

అనకాపల్లి: జిల్లాలో సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువగా అపరాల సాగు జరిగిందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నువ్వు పంట వివిధ దశల్లో ఉందన్నారు. పెసర, మినుము పంటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, సరళిపై వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, తేజస్‌రావు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, రమణమూర్తి, శాస్త్రవేత్తలు సీహెచ్.శ్రీలత, బి.భవాని, ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



తాళ్లపాలెం బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.గ్రేస్

కశింకోట: ఇంటర్ విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేస్ కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న బాలికలతో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రశ్నాపత్రాలు ఇచ్చిన తర్వాత నిదానంగా చదివి వాటిని అర్థం చేసుకొని జవాబులు రాయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 9,429 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	4,710
మొదటి రకం	3,580	4,140
రెండో రకం	3,100	3,730
మూడోరకం	2,800	3,080

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం, మ్యాట్నీ)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(1,2 షోలు)
అగాథియా : సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
గార్డ్ : వెంకటేశ్వర
తండేల్ : శ్రీసత్య
శుభం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

చురుగ్గా ఫార్మర్ రిజిస్ట్రేషన్లు

- ఆధార్ తరహా యూనిక్ ఐడీ కోసం నమోదు
- రైతు సేవా కేంద్రాలకు క్యూకడుతున్న రైతులు



రైతుల ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహనరావు, ఏవో రంగాచారి



తుమ్మపాల రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుకు క్యూ కట్టిన రైతులు

తుమ్మపాల: రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య(ఆధార్ తరహా సంఖ్య) కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే సంక్షేమ పథకాల మంజూరుకు కసరత్తు జరుగుతోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కొద్ది రోజులుగా చురుగ్గా సాగుతోంది. మండలంలో వరి, చెరకు, సరుగుడు, ఉద్యాన వన పంటలైన టమాటో, వంకాయ, గోరు చిక్కుడు, బెండ, కాకర, పలు రకాల కూరగాయల పంటలు సాగవుతున్నాయి. మండలంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం సుమారు 6 వేల ఎకరాలు కాగా, రబీలో 3 వేల ఎకరాల వరకు సాగవుతోంది.

- మండలం పరిధిలో సుమారు 15 వేల మంది రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేయాల్సి ఉంది. సొంత భూమి ఉన్న రైతులు అందరూ రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పాసు పుస్తకం, ఫోన్ నంబర్ లింక్ అయిన ఫోన్ తీసుకువెళ్లి నమోదు చేసుకున్నట్లయితే ఓటీపీ వస్తుంది. ఓటీపీ మూడు సార్లు వచ్చిన తరువాత 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య యాప్‌లో నమోదవుతుంది.
- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీతో పాటు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి ఈ సంఖ్య అధికారికంగా పని చేస్తుంది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ మాఫీ, వ్యవసాయ పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు పొందే వీలుంటుంది.

మండలంలో 70 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి

తుమ్మపాల మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చురుగ్గానే జరుగుతోంది. గత 20 రోజులుగా రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులు వివరాలను నమోదు చేస్తున్నారు. సకాలంలో సమాచారం అందించడంతో రైతులు కూడా ఆసక్తితో తరలివస్తున్నారు. సాగు భూమి వివరాలు గల పాసు పుస్తకంతో పాటు ఆధార్ లింకైన ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీల సమాచారం సిబ్బందికి అందించి నమోదు చేయించుకోవడంతో మండలంలో దాదాపు 70 శాతం అంటే 9 వేల పైచీలుకు రైతుల వివరాలు నమోదు పూర్తయింది. మరో 5 వేల మంది వరకు రైతుల వివరాలు నమోదు కావాల్సి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి. ప్రతి గ్రామంలో రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సహాయకులు తమ పరిధిలో ఉన్నటువంటి రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. రైతులు పాసు పుస్తకంతో పాటు ఆధార్, ఆధార్‌కు లింకైన ఫోన్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవచ్చు. ఆధార్ తరహాలో రైతుకు యూనిక్ ఐడీ కార్డు వస్తుంది. భవిష్యత్తులో ఈ కార్డు ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి, బ్యాంకు రుణాలు, పంట నష్టం జరిగితే పరిహారం వంటి అన్ని రకాల సేవలు సులభమవుతాయి. – పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి కేంద్రానికి ప్రత్యేక బస్సు

కశింకోట: ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని మూడు ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి 259 మంది విద్యార్థులు శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. తాళ్లపాలెంలో ఉన్న ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి 125 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 72 మంది ప్రథమ సంవత్సరం కాగా, మిగిలిన 53 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. వీరికి యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి వద్ద ఉన్న గురుకుల పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. అక్కడికి చేరడానికి ఆర్టీసీ బస్సును ప్రభుత్వం సమకూర్చినట్లు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ తెలిపారు. తేగాడ వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 41 మంది ప్రథమ సంవత్సరం, మిగిలిన 35 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. వీరికి పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లిలో కేటాయించారు. అక్కడకు ఆటోలు సమకూర్చామని, వాటిపై పరీక్షా కేంద్రానికి చేరుకోనున్నట్లు ప్రిన్సిపాల్ మార్తా తిలకం తెలిపారు. తేగాడ వద్దే ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం నుంచి 58 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 30 మంది మొదటి ఏడాది కాగా, మిగిలిన 28 మంది ద్వితీయ సంవత్సరం. వీరికి కూడా అనకాపల్లి కళాశాలల్లో పరీక్షా కేంద్రం కేటాయించడంతో అక్కడకు రోజూ చేరడానికి ఆటోలు సమకూర్చామని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి నిర్వహించేందుకు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించమన్నారు. మాస్ కాపీయింగ్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయరాదని ఆయన హెచ్చరించారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీలలో జాతీయ స్థాయి బ్యాంక్ సమ్మెలో భాగంలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏయూఏపీసీ జిల్లా సెక్రటరీ పైలా ప్రసాద్‌రావు, యూనియన్ బ్యాంక్ జిల్లా సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పని దినం, ఔట్ సోర్సింగ్ నియామకాలు నిలుపుదల, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

కానిస్టేబుల్ టాలెంట్ టెస్ట్ రేపు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం పార్క్ సెంటర్‌లోని శ్రీగౌరీ గ్రంథాలయంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కానిస్టేబుల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 93266 88899 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బెంచీల వితరణ



ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బెంచీలు అందజేస్తున్న క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.80వేలు విలువ చేసే బెంచీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ మళ్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన పూర్వ విద్యార్థులు పాఠశాలలకు తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. కళాశాలకు మరో 15 బెంచీలు కావాలని అధ్యాపకులు, విద్యార్థులు అడగగా.. నాలుగు మాసాల్లో సమకూర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బి.సుజాత, రోటరీ క్లబ్ అనకాపల్లి అధ్యక్షుడు సరిసా రాజేష్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, క్లబ్ కార్యదర్శి డి.అనిల్, కోశాధికారి జి.సత్యేంద్ర, పబ్లిక్ ఇమేజ్ చైర్‌పర్సన్ బుద్ధ రమణాజీ, క్లబ్ సీనియర్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, పీజె.నాయుడు, కె.వి.గౌరీపతి, రవిరామ్‌జవహర్, శేషుకుమార్, బి.ఎస్.గుప్తా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ధర్మారావు

కశింకోట: ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ధర్మారావు కోరారు. కశింకోటలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా జీవించాలంటే ప్రకృతి సిద్ధంగా పండిన ఆహార ఉత్పత్తులను వినియోగించాలన్నారు. మండలంలో ప్రస్తుతం 14 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగవుతోందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు. ఆనందపురం గ్రామాన్ని రసాయన ఎరువుల వాడక రహితంగా శత శాతం ప్రకృతి వ్యవసాయం చేపట్టడానికి ఎంపిక చేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, ఏపీఎం పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

'రైతులను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్'



మలసాల రమణారావు

కశింకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ రైతులను తీవ్ర నిరాశ పరిచిందని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఏడాదికి అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తానని ప్రకటించారని, దీన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ ఆర్థిక సహాయంతో కలిపి ఇవ్వనున్నట్లు చెబుతుండటం శోచనీయమన్నారు. వ్యవసాయ రంగం ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని తెలిపారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, పంటకు గిట్టుబాటు లభించకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందుగా ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా ఏడాదికి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున అందించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం అయ్యప్పస్వామి 31వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు నిత్య అర్చనలు, అభిషేకాలు, గణపతి పూజ, ఉత్తర నక్షత్ర సహిత రుద్ర పాశుపత అభిషేకం, సూర్యనమస్కారాలు చేస్తామన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆవిష్కరణ, సృజనాత్మకత విద్యార్థులకు అసలైన సంపద



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విజయ్ విట్టల్

పాయకరావుపేట: మనిషి జీవితంలో అసలు సంపద అనేది ఆవిష్కరణ, సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన క్రామ్సన్ రీసెర్చ్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ విట్టల్ టి.మథాడ్ అన్నారు. స్వేసెస్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయనతోపాటు గౌరవ అతిథిగా ఏయూ డిపార్టుమెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.వి. రమేష్ హాజరయ్యారు. విజయ్ విట్టల్ మాట్లాడుతూ విజయాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, వృద్ధి, చురుకుతనం, వాక్చాతుర్యం అనే 8 విషయాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ విజేతలు కావాలంటే పరిశీలనా నైపుణ్యాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి హాజరైన 300 మంది విద్యార్థుల మధ్య పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, క్విజ్, సైన్స్ ప్రాజెక్టులు తదితర అంశాలపై విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జీవీఎంసీ స్కూల్‌లో నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు



విద్యాధరి స్కూల్లో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు




మామిడిపాలెం హైస్కూల్‌లో ప్రకృతి పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రదర్శన

అనకాపల్లి టౌన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. వర్షపు నీరు వినియోగం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వంటి నమూనాలు ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, మోడల్ మేకింగ్ అంశాలలో పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం జి.బ్రహ్మాజీ బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు సత్తిబాబు, వరహాలు, శుభశ్రీ పాల్గొన్నారు. వాసవీ బాలవిహార్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

- మామిడిపాలెం జెడ్పీ స్కూల్‌లో మహమ్మద్ షబానా తయారు చేసిన గ్యాస్ లీకేజీ అలారం ప్రాజెక్ట్ ఆలోచింపజేసింది. ప్రకృతి పరిరక్షణపై పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ పూడి పరదేశినాయుడు బహుమతులు అందజేశారు. విద్యాధరి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులను ఎంఈవోలు దివాకర్, కోటేశ్వరావు తిలకించారు. చంద్రయాన్-3 ల్యాండర్, రోవర్, జనరేటింగ్, సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రదర్శనలు చేసిన విద్యార్థులను వారు అభినందించారు. హ్యాపీ కిడ్స్ స్కూల్లో ప్రదర్శించిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి.

కశింకోట: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో నమూనాలు తయారు చేసి ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. కశింకోటలోని బాలికల హైస్కూలులో వైజ్ఞానిక నమూనాలను ఎంఈవోలు సురేష్, కె.ఎస్.ఎన్.మూర్తి తిలకించారు. సైన్స్ వరమా? శాపమా? అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాసు, సైన్స్ ఉపాధ్యాయుడు నరసింహారావు, పీడీ పెంటకోట కమల, విద్యా నిర్వహణ కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో వివిధ నమూనాలను సృజనాత్మకతతో తయారు చేసి విద్యార్థులు ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, బిందు సేద్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి నమూనాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు కె.అప్పారావు, పి.వి.ఆర్.ప్రభాకర్, ఎస్.జె.వి.ప్రసాద్, పీడీ వేదుల ప్రభాకరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం గాయత్రి స్కూలులో సి.వి.రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ప్రదర్శించారు. రోబో నమూనా ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.



కశింకోట బాలికల హైస్కూలులో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో సురేష్



కశింకోట డీపీఎన్ హైస్కూలులో నమూనాలు తిలకిస్తున్న ఎంఈవో కె.ఎస్.ఎన్ మూర్తి



గాయత్రి స్కూల్లో విద్యార్థులు తయారు చేసిన రోబో